ఉపాధి పనులకు కనీస వేతనం ఇవ్వాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఉపాధి హామీ పనుల నిర్వహణకు కనీస వేతనం ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని, చొప్పరమెట్ల, చిన్నాగిరిపల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద చేపడుతున్న పశువుల నీటితొట్లెలు, పశువుల షెడ్లు, నీటి కుంతలు, మామిడి, గులాబీ తోటలు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుబ్బారావు, డిపిఒ కె.అనూరాధ, ఎంపిడిఒ ఓ.భార్గవి, ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి మీనాక్షి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ.. గాడిన పడేనా..!

ప్రజా సమస్యలపై సిబ్బంది స్పందించరు..
సమాధానం ఇవ్వరు
ఏ సమస్యపై వెళ్లినా సర్వర్ డౌన్.. సర్వేల పనంటూ సమాధానం
పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శులు కార్యాలయాలకే రారు
కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల నుంచి ఏ ఒక్క సేవా అందని దుస్థితి
రేషన్‌కార్డుల అంశంలోనూ జనాలకు ముప్పతిప్పలు
రెండు జిల్లాల్లో దాదాపు 938 సచివాలయాలు, 8 వేలకుపైగా ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల పని తీరుపై జనాల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. గ్రామ, వార్డు సచివాలయాలకు పనుల మీద వెళ్తున్న ప్రజలను అక్కడ కనీసం పట్టించుకునేవారే లేకుండాపోతున్నారు. పనులపై వెళ్లిన జనాన్ని ఎందుకొచ్చారో కనీసం అక్కడి ఉద్యోగులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యలపై వెళ్లిన జనం అడిగినా సరిగా సమాధానం చెప్పని పరిస్థితి ఉంది. ఫోన్లు చూసుకుంటూ చాలా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఏ పనిపై వెళ్లినా సర్వర్ పని చేయడం లేదనే సమాధానాలతో సరిపెడుతున్నారు. దీంతో జనం గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లేందుకు వెనకాడుతున్నారు. సచివాలయాల్లోని ఉద్యోగులను సక్రమంగా పని చేయించుకునేలా పంచాయతీ కార్యదర్శులు కార్యాలయాలకు సరిగా రావడం లేదు. దీంతో సచివాలయ ఉద్యోగులు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు పరిస్థితి తయారైంది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2019లో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చింది. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయంలోనూ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, విఆర్ఓ, ఎఎన్ఎం, ఫిషరీస్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఇలా 11 మంది ఉద్యోగులను ప్రభుత్వం నియమించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 938 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 8,468 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రజలకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు, రేషన్‌కార్డుల సమస్యలు, విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పలురకాల సేవలు సచివాలయాల్లోనే జరిగేలా ప్రభుత్వం ఈ వ్యవస్థను తెచ్చింది. గ్రామ, వార్డు

సచివాలయాల్లో ప్రస్తుతం ఎటువంటి సేవలూ అందడం లేదు. మీసేవా కేంద్రాల్లోనే జనం తమ పనులు చేసుకుంటున్నారు. ఎందుకంటే గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్తే అక్కడి ఉద్యోగులు సరిగా స్పందించకపోవడమే కారణంగా చెబుతున్నారు. ప్రస్తుతం నూతన రేషన్‌కార్డులకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియలో సైతం జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వర్ పని చేయడం లేదని రోజులు తరబడి జనాన్ని సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిప్పించుకుంటున్నారు. దీంతో సచివాలయాల్లో ఉద్యోగుల పని తీరుపై ఎటువంటి పర్యవేక్షణా లేకుండాపోయింది.

సర్వేలతోనే సరి.. ప్రజా సమస్యలు గాలికి

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని చెప్పొచ్చు. సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం సర్వేలకు మాత్రమే ఉపయోగిస్తోంది. ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై ఉద్యోగులు పని చేయడం లేదు. ఇదే అదునుగా ఉద్యోగులు అసలు సచివాలయాల్లోనే ఉండటం లేదు. అదేమని అడిగితే సర్వేకు వెళ్లాలని సమాధానం ఇస్తున్నారు. చాలామంది ఉద్యోగులు అసలు విధులకు రాకుండా సర్వేల పేరుతో తప్పించుకుంటున్నారనే విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత దగ్గర చేసేందుకు తెచ్చిన సచివాలయ వ్యవస్థ పూర్తిగా గాడితప్పిన పరిస్థితి ఉంది. సచివాలయాలకు డిడిఒగా పంచాయతీ కార్యదర్శి ఉంటారు. పంచాయతీ కార్యదర్శులు వారంలో సగం రోజులు కార్యాలయాలకే రావడం లేదని తెలుస్తోంది. పెన్షన్ల పంపిణీ, ఇతర రోజు ఉద్యోగులందరూ పాల్గొనాలనే నిబంధన ఉన్నప్పటికీ చాలామంది పంచాయతీ కార్యదర్శులు పెన్షన్ల పంపిణీలో పాల్గొనడం లేదు. రెండు, మూడు పంచాయతీలకు ఇన్‌ఛార్జులుగా ఉండటంతో ఎవరైనా అడిగితే ఎక్కడో ఒకచోట ఉన్నట్లు చెబుతూ తప్పించుకుంటున్నారనే విమర్శలున్నాయి. దీంతో సచివాలయాల ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే చర్చ నడుస్తోంది. సచివాలయాలకు వస్తున్న ప్రజల పట్ల అక్కడి ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరు మారాలని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా సచివాలయ వ్యవస్థను చక్కదిద్దాలని అంతా కోరుతున్నారు.

సోలార్ యూనిట్ల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో సోలార్ ప్యానల్ యూనిట్ల రిజిస్ట్రేషన్, స్థాపన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం అమలులో భాగంగా సోలార్ ప్యానల్ యూనిట్ల రిజిస్ట్రేషన్, స్థాపన ప్రగతిని మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఆమె సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఈ పథకం అమలు మందకొడిగా సాగడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం విస్తృతస్థాయిలో అమలు చేయడానికి రాష్ట్రంలోనే అనువుగా ఉన్న ఏకైక జిల్లా పశ్చిమగోదావరి జిల్లా అన్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న జిల్లాలోనే ఈ పథకాన్ని అమలు చేయలేకపోతే రాష్ట్రంలో ఎక్కడా పెద్దస్థాయిలో అమలు చేయలేరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ పథకం అమలైనా జిల్లాలో రెండు, మూడుస్థానాల్లో ఉంటుందని, అటువంటిది ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం జిల్లాలో నత్త నడకన నడుస్తుందన్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పని చేసి రాబోయే రెండు నెలల్లో రాష్ట్రంలో రెండు, మూడు స్థానాలకు చేరేలా కృషి చేయాలన్నారు. బ్యాంకు రుణం మంజూరులో ఎటువంటి జాప్యమూ జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. సోలార్ యూనిట్ల స్థాపన వల్ల కలిగే ప్రయోజనాలను విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్ని సమీక్ష సమావేశాలు నిర్వహించినా క్షేత్రస్థాయిలో కార్యాచరణ లేకపోతే ఏ పథకమూ విజయవంతం కాదన్నారు. మంజూరైన యూనిట్లు స్థాపనలో వెండర్స్ ఎటువంటి జాప్యమూ లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. యూనిట్ల స్థాపనలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ గూగుల్‌మీట్‌లో జిల్లా విద్యుత్ శాఖాధికారి ఎ.రఘునాథ్‌బాబు, డిఇలు, ఎఇలు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకపోవడం దారుణం

ఎపి వ్యకాస

మాట్లాడుతున్న వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి చినవీరభద్రరావు

ప్రజాశక్తి - అత్తిలి

ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా పాలకులు మీనమేషాలు లెక్కించడం దారుణమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు విమర్శించారు. అత్తిలి మండలం కొమ్మర గ్రామంలో ఉప్పరగూడెం ఏరియాలో పని చేస్తున్న కూలీలను మంగళవారం కలిసి వారితో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, వలసలు నివారణ, గ్రామీణ పేదల జీవన ప్రమాణాలు మెరుగు వంటి ఉన్నతమైన లక్ష్యాలతో ఉపాధి హామీ చట్టం వచ్చిందన్నారు. ఈ చట్టం గ్రామీణ పేదలకు ఆసరాగా ఉంటూ వారికి పని గ్యారంటీ అనే ధైర్యాన్ని కలిగించిందని ఆయన చెప్పారు. పేదరిక నిర్మూలనకు భరోసా కలిగించే ఉపాధి హామీ చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు అవసరమైన నిధులను బడ్జెట్లో కేటాయించి, చట్టప్రకారం చేసిన పనికి 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని నిబంధన ఉన్నప్పటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి కూలీలకు మూడు మాసాలుగా బకాయిల చెల్లింపులో జాప్యం చేయడం సరికాదని వీరభద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కూలీల ఆగ్రహానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధనికొండ దుర్గ, గండికోట హేమలత, పెరుమాళ్ల జీవనబాబు, దుర్గారావు, అనంతలక్ష్మి, కోటమ్మ పాల్గొన్నారు.

పలు విద్యా సంస్థల్లో దోపిడీ..!

భీమవరం : పుస్తకాల గదికి తాళం వేస్తున్న డివైఇఒ రమేష్

అధిక ధరలకు పుస్తకాలు, విద్యా సామగ్రి విక్రయం
చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నిరసనలు

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ విద్యాసంస్థల్లో పుస్తకాలను విక్రయం పేరుతో వ్యాపారం చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.గణేష్, టి.ప్రసాద్ విమర్శించారు. నారాయణ విద్యాసంస్థలో అధిక ధరలకు పుస్తకాల విక్రయాన్ని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. పుస్తకాలు, విద్యా సామగ్రి నిల్వచేసిన గది ఎదుట బయట మంగళవారం నిరసన తెలిపారు. పుస్తకాలు, విద్యా సామగ్రి పేరుతో అక్రమ వ్యాపారం చేస్తున్న విషయాన్ని డివైఇఒ రమేష్ దృష్టికి ఎస్ఎఫ్ఐ నేతలు తీసుకెళ్లారు. దీంతో డివైఇఒ పుస్తకాల గదిని పరిశీలించి గదికి తాళాలు వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నేతలు గణేష్, ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో నారాయణ విద్యాసంస్థల దోపిడీయే పరమావధిగా ఉన్నాయని విమర్శించారు. వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఐగా విద్యా వ్యాపారాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు తెరిచి వ్యాపారం చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్నాయని ఆందోళన చేస్తున్నా విద్యాశాఖ పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు వీడి పుస్తకాలు, అధిక ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు లేని విద్యాసంస్థల జాబితాను విడుదల చేయాలని పేర్కొన్నారు. ఒక బ్రాంచ్‌కు అనుమతి తీసుకొని పది బ్రాంచులు కొనసాగిస్తున్న విద్యాసంస్థలపై పోరాడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గోవింద్, జిల్లా కమిటీ సభ్యులు రోహిత్, సింధు పట్టణ నాయకులు కె.రోహిత్, సాయిఫణి కుమార్, రమాదేవి, ధనుష్ పాల్గొన్నారు.

పాలకొల్లు శ్రీచైతన్య స్కూల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న గదిని పరిశీలించిన ఎంఇఒ

పాలకొల్లు : స్థానిక శ్రీచైతన్య స్కూల్లో ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అధిక ధరలకు అమ్మి విద్యార్థులను మోసం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ నేతలు స్కూల్ వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నేతల ఫిర్యాదు మేరకు ఎంఇఒ శర్మ పుస్తకాలు ఉన్న గదులను పరిశీలించి సీజ్ చేశారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు ప్రయివేటు స్కూళ్లలో అమ్మడం నిషేధమని, ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు మేరకు 2 గదులను సీల్ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు ఎంఇఒ తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు పవన్, కార్యదర్శి తేజ, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎపి డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. కాళ్ల గ్రామంలో జిల్లా, మండల పరిషత్, ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన నాలుగు సిమెంట్ రోడ్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బందా విజయ, ఉప సర్పంచి పన్నాసి వెంకటేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు జివి.నాగేశ్వరరావు, టిడిపి గ్రామాధ్యక్షులు పెంటపాటి వెంకటనాగేశ్వరరావు, ఎం.మాధవరావు, బండారు నాని, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్లను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

కోపల్లెలో సచివాలయం ప్రారంభం

గ్రామ సచివాలయ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. కోపల్లెలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బూడి నాగమణి, ఉపసర్పంచి బూడి వెంకటపత్రాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు

కిశోరి వికాసం ముగింపులో ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం

బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి హెచ్చరించారు. జిల్లాలో గత నెల రెండో తేదీ నుంచి జరుగుతున్న కిశోరి వికాసం కార్యక్రమం గరగపర్రులో మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి బాలికలతో ముఖాముఖి అయ్యారు. వివిధ అంశాలపై బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతగా ఉండడంతోపాటు గౌరవంగా మసులుకోవాలంటే కొన్ని నిర్ణయాలకు కట్టుబడి ఉండాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ప్రతిఒక్కరూ గమనించాలన్నారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేస్తున్నారని, ఇది చట్టరీత్యా నేరమని చెప్పారు. బాల్య వివాహ చట్టప్రకారం శిక్షార్హులని హెచ్చరించారు. డిసిపిఒ రాజేష్ మాట్లాడుతూ కిశోరి వికాసంలో భాగంగా ఇప్పటివరకు జరిగిన కార్యక్రమాలపై ఆరా తీశారు. బాలికలకు పలు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. సిడిపిఒ

మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి

వాణివిజయరత్నం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాలికలు సమాజంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పార్వతి, ఎంఎస్‌కె.వాసవి, అంగన్వాడీలు నాగలక్ష్మి, పద్మ, సరోజిని, విజయలక్ష్మి, అనంతలక్ష్మి, సీత, ఇందిర, రూత్‌మేరీ, అధికారులు, గ్రామస్తులు, బాలికలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - నరసాపురం

ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి జి.గీతాబాయ్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఎల్‌బిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వివరాలు, వైద్య సిబ్బంది, రోగులకు అందుతున్న సేవలు, పెండింగ్ పనులు, వ్యాక్సిన్లు, మందుల స్టాక్‌పై ఆరా తీశారు. జర్వాలు ఎక్కువగా ఉన్న చోట ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. ఏమైనా అనుమానంగా ఉంటే తక్షణం వైద్యాధికారులకు తెలియజేయాలన్నారు. విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వేను నూరుశాతం పూర్తి చేయించేలా చూడాలని వైద్యాధికారి మాధురిని ఆదేశించారు.

రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ

ఉపాధ్యాయులకు ఉద్యమ అభినందనలు

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఒకపక్క ప్రభుత్వ ఒత్తిడి.. మరోపక్క అధికారుల ఒత్తిళ్లను సైతం తట్టుకుని ధైర్యంగా నిలబడిన ఎస్‌జిటి ఉపాధ్యాయులకు ఉద్యమ అభినందనలు తెలియజేస్తున్నానని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఐక్యవేదిక కన్వీనర్ పిఆర్‌విఎస్.సాయివర్మ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఐక్యవేదిక ఆధ్వర్యంలో అభినందనలు తెలియజేసి నినాదాలు చేశారు. అనంతరం ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ మాన్యువల్ కౌన్సెలింగ్‌కు అంగీకరించిన విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్య పోరాటాలతోనే సాధ్యమన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ రెండు రోజులపాటు తీవ్రమైన ఎండను లెక్కచేయకుండా పోరాడిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పిఆర్‌సి, ఆర్థిక సమస్యలను పరిష్కరించుకోవడానికి చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం, పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పట్టాభి రామయ్య, ఐక్యవేదిక నేతలు బి.మురళీ, మోహన్‌బాబు, కె.సురేష్‌కుమార్, శ్రీనివాస్, రామకృష్ణంరాజు, రవికుమార్‌రాజు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

కొల్లేరు ప్రజల ఉపాధి కాపాడాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హామీలు అమలు చేయాలి
సిపిఎం ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొల్లేరును 5 నుండి 3వ కాంటూరుకు కుదించి కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, పర్యావరణంతోపాటు కొల్లేరు ప్రజల ఉపాధిని కాపాడాలని, కొల్లేరు ప్రజలకు నష్టం కల్గించే ఎకోసెన్సిటివ్ జోన్‌ను ఉపసంహరించుకోవాలని, కొల్లేరు ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఉద్దరాజు రామం భవనంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన కొల్లేరు ప్రజల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ ప్రజాసంఘాలు, కొల్లేరు ప్రాంత నాయకులు, రైతుసంఘాలు, సామాజికవేత్తలు పాల్గొన్నారు. కొల్లేరు ప్రజల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రిటైర్డ్ ఐఆర్ఎస్, కొల్లేరు గ్రామాల అభివృద్ధి సంఘం అధ్యక్షులు చాగంటి సంజయ్, నేత పల్లెం ప్రసాద్, కొల్లేరు ప్రాంత మహిళా నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, కొల్లేరు రైతుసంఘం నాయకులు నంబూరి శివాజీరాజు, నంబూరి వెంకటరామరాజు (తాడినాడ బాబు), ప్రముఖ సామాజికవేత్త ఆర్.మణిసింగ్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సాలి రాజశేఖర్, మాజీ ఎంపిపి మోరు సుబ్బారావు, కొల్లేరు ప్రాంత నాయకులు మండల కొండలరావు, దళిత బహుజన నాయకులు నేతల రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తదితరులు మాట్లాడారు.

కొల్లేరును 5 నుండి 3వ కాంటూరుకు కుదిస్తామన్న పాలకుల హామీలు అమలు కాలేదన్నారు. కొల్లేరులో 46 బెడ్ గ్రామాలు, 74 బెల్ట్ గ్రామాల్లో మూడు లక్షల మంది మత్స్యకారులు, దళితులు ఉన్నారని చెప్పారు. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో ఐదో కాంటూరు లోపల ఉన్న వేలాది ఎకరాల్లోని చెరువులన్నింటినీ ధ్వంసం చేసి లక్షలాది మంది కొల్లేరు ప్రజల జీవనాన్ని నాశనం చేశారని విమర్శించారు. 5వ కాంటూరు పరిధిలో 77,138 ఎకరాల చెరువుల ధ్వంసం పేరుతో 86 వేల ఎకరాలను, ఇందులో 7100 ఎకరాల్లో సొసైటీ చెరువులు, 14,800 ఎకరాల్లో జిరాయితీ భూముల చెరువులను ధ్వంసం చేశారని గుర్తు చేశారు. దీంతో కొల్లేరు ప్రజల పరిస్థితి గట్టునపడ్డ చేపల్లా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరులోని వేలాది మంది ప్రజలు పొట్ట నింపుకునేందుకు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లారని, వెళ్తున్నారని చెప్పారు. ఉపాధి లేక కొల్లేరు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొల్లేరులో రెగ్యులేటర్లు కడతామని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఉపాధి కల్పిస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగా మారిపోయాయన్నారు. ప్రస్తుతం కొల్లేరు తుమ్మ చెట్లు, కిక్కిసతో నిండిపోవడంతో చేపల వేటకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఫారెస్ట్ అధికారుల వేధింపులు, లంచాలు పెరిగిపోయి కొల్లేరు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరు ప్రజల ఉపాధికి నష్టం కలిగించేలా కొంతమంది పర్యావరణం పేరుతో సుప్రీంకోర్టుకు వెళ్లగా కొల్లేరు పేదల సాగులో ఉన్న 15 వేల ఎకరాల్లో చెరువులు ధ్వంసం చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చెరువులు పూర్తిగా ధ్వంసం చేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కేసులో ఇంప్లీడ్ కాకపోవడం వల్లే సుప్రీంకోర్టు ఏకపక్షంగా తీర్పునిచ్చిందన్నారు. కొల్లేరు ప్రజల ప్రస్తుత సమస్యలు పరిష్కరించడం మానేసి కొత్త సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. ఐదో కాంటూరు నుండి పది కిలోమీటర్లకు సున్నిత పర్యావరణ ప్రదేశం పేరుతో 26 నిబంధనలను పెట్టి కొల్లేరు మొత్తాన్ని అష్టదిగ్బంధనం చేసి పూర్తిగా అటవీశాఖ చేతుల్లో పెట్టబోతున్నారని వివరించారు. ఏలూరు జిల్లాలో కొల్లేటి ప్రాంతమైన నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఏలూరు, పెదపాడు, మండవల్లి, కైకలూరు, ఆకివీడు మండలాల్లోని 89 గ్రామాలపై ఈ ప్రభావం పడనుందన్నారు. ఇలాంటి దారుణమైన 26 నిబంధనలతో కొల్లేరు చుట్టుపక్కల 89 గ్రామాల్లోని లక్షలాది మంది ప్రజల పొట్ట కొట్టే నిర్ణయాన్ని తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో ఎపి చేతివృత్తిదార్ల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు, కొల్లేరు ప్రాంత నాయకులు తాతపూడి రామ్‌చంద్, ఎం.శివప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కెఎస్ఎన్.మూర్తి, ఎస్‌వి.సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, కెవిపిఎస్ నాయకులు కాకర్ల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వీరవాసరం

ఉద్యోగ కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా జులై 9వ తేదీన సమ్మె జరగనుందని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు తెలిపారు. యుటిఎఫ్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన సమావేశానికి రైతు సంఘం నాయకులు బాలం విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పని గంటలు, కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి అనేక విషయాల్లో నష్టం చేసే విధంగా లేబర్ కోడ్‌లను రూపొందించారని, దీనివల్ల ఉద్యోగ కార్మికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ఇప్పటికే పరిశ్రమల్లో కార్మికులకు భద్రత లేకుండా పోయిందని, ప్రమాదాలకు గురవుతున్న కార్మికులకు తగు విధంగా వైద్యం, నష్టపరిహారం అందడం లేదని అన్నారు. కార్మిక శాఖను కార్మికుల సంక్షేమం కోసం కాకుండా యాజమాన్యాలకు ఊడిగం చేసే విధంగా మార్పు జరుగుతుందన్నారు. తక్షణం లేబర్ కోడ్‌లను రద్దుచేసి కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత 11 ఏళ్ల కేంద్ర బిజెపి పాలనలో దేశంలో ఉన్న అన్ని తరగతుల ప్రజలూ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా కార్మిక వర్గం మరో పోరాటానికి సిద్ధమైందని తెలియజేశారు. జులై 9వ తేదీన జరుగుతున్న సమ్మెలో అన్ని తరగతుల కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు డి.వరలక్ష్మి, నాగ పార్వతి, తులసి, వెంకటలక్ష్మి మాట్లాడారు.

గ్రామాల అభివృద్ధే కూటమి లక్ష్యం

ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మంగళవారం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన టిడిపి వీరవాసరం మండల కమిటీ సభ్యులు ఎంఎల్‌ఎ అంజిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి కూటమి ప్రభుత్వం బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం మండల కమిటీ సభ్యులు ఎంఎల్‌ఎను సత్కరించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు ఉన్నారు.

ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

టిడిపి భీమవరం ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి ఆదేశాల మేరకు టిడిపి పట్టణ అధ్యక్షులు మద్దుల రాము ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం ఎన్‌టిఆర్ విగ్రహం ఎదురుగా ప్రేమాలయం వృద్ధాశ్రమంలో హిందూపురం ఎంఎల్‌ఎ నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు నిర్వహించి వృద్ధులకు భోజనాలు అందించారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి పార్థసారధి మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమలో మాస్ ఫాలోయింగ్ సినిమాలకు బాలకృష్ణ కేరాఫ్ అడ్రస్ అన్నారు. పట్టణ అధ్యక్షుడు మద్దుల రాము మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వెల్లంకోయిన గోవింద్, ఎం.ఐజాక్‌బాబు, కొండ్రు శ్రీనివాస్, దొంగ వెంకటేశ్వరరావు, వై.సురేష్, జి.ధనరాజ్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

సమాజాన్ని గమనించాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

తమకు సంబంధం లేదనుకోకుండా సమాజంలో జరుగుతున్న ప్రతీది బాలికలు గమనించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి అన్నారు. విస్సాకోడేరులో అంగన్వాడీ టీచర్ తాయారు ఆధ్వర్యంలో కిశోరి వికాసం ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సూపర్‌వైజర్ బాలికలకు చట్టాలు, బాల్య వివాహాలు, విద్య, సమాజం పట్ల బాధ్యత విషయాలపై అవగాహన కల్పించారు. బాలికలు ధైర్యంతో ముందుకు సాగినప్పుడే ఫలితాలు వాటంతటవే వస్తాయని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఎఎన్‌ఎంలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట : బాల్య వివాహాలపై యువతీ యువకులు అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ కోట సరోజిని అన్నారు. ఆచంట పంచాయతీ పరిధి చిన్న పేటలో కిశోరి బాలికలకు కిశోరి వికాసం ముగింపు కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహం వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు. చట్టరీత్యా బాల్య వివాహాలు చేసుకుంటే శిక్షార్హులవుతారన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పెనుమంట్ర: అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని కిశోర బాలికల వికాసానికి కృషి చేస్తామని అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో నెలరోజులుగా పైగా జరిగిన కిశోరి బాలికల వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా భట్లమగుటూరు గ్రామంలో జరిగిన కిశోరి వికాసం వేసవిలో శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐసిడిఎస్ పెనుమంట్ర ప్రాజెక్ట్ అధికారి అంగర కృష్ణకుమారి మాట్లాడారు. సిడిపిఒ వెంకటలక్ష్మి ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దని మహిళా పోలీస్ కానిస్టేబుల్ స్వప్నశ్రీ తెలిపారు. మంగళవారం స్థానిక సుబ్బారావుపేట ఐదో వార్డు అంగన్వాడీ సెంటర్లో కిశోరి వికాసం వేసవి శిక్షణ శిబిరాలు ముగింపు కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సత్యవతి, మహిళా పోలీస్ స్వప్నశ్రీ, మహిళలు, ప్రత్యేక ఉపాధ్యాయుడు, ఎస్‌కె.బాల ఈశ్వరయ్య సైకిల్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐదో వార్డ్ గ్రామ సచివాలయ ఆరోగ్య కార్యకర్త డి.సుష్మ మాధురి మాట్లాడారు. కిశోర వికాసం బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

పెనుగొండ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా సుజాత మాట్లాడారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం.వాసుదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితురాలికి జైభీమ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రతి నెల 10వ తేదీన క్రమం తప్పకుండా ఒక కుటుంబాన్ని గుర్తించి వారికి సహాయం అందించడం మూడేళ్లుగా జరుగుతోందని జైభీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గెడ్డం సునీల్ గవాస్కర్ అన్నారు. గౌరవాధ్యక్షులు భవానీ ప్రసాద్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారికి చేయూతనివ్వడం గొప్ప ఆనందాన్నిస్తుందని తెలిపారు. జైభీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యుల సహకారంతో జూన్ నెలకు గాను పాలకొల్లుకు చెందిన ప్రమాదంలో ఒక కాలు పోగొట్టుకున్న గూడూరి సరస్వతికి వైద్య సహాయం నిమిత్తం మంగళవారం రూ.18,500 జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యుల చేతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆపద్బంధు వాలంటరీ బ్లడ్ బ్యాంక్ అధినేత ఈదుపల్లి శ్రీధర్, సోషల్ సర్వీస్ మెన్ సతీష్, శ్రీ వైష్ణవి స్కూల్ ప్రిన్సిపల్ హరీష్, ఆదిత్య స్కూల్ ఇంగ్లీష్ టీచర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాయలంలో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కూటమి ప్రభు త్వంలో అన్ని గ్రామాలనూ మోడ్రన్ గ్రామాలుగా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. రాయలం గ్రామంలో మంగళవారం పలు అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎంఎల్ఎ అంజిబాబు, మాజీ ఎంపీ సీతారామలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. రూ.19 లక్షలతో రాయలం పంచాయతీ కార్యాలయం, రూ.34 లక్షలతో సీసీ డ్రెయిన్ పనులను ప్రారంభించామని తెలిపారు. గత ఐదేళ్లలో అభివృద్ధి అంటేనే కనిపించలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లోనే అన్ని గ్రామాలనూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. భీమవరం నియోజకవర్గంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేస్తున్నామని, రానున్న రోజుల్లో భీమవరం నియోజకవర్గాన్ని ఆదర్శంగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో రాయలం గ్రామస్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భారీగా నిలిచిన ట్రాఫిక్

మొగల్తూరులో నిలిచిన ట్రాఫిక్..

జనం అవస్థలు

మొగల్తూరు: జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా మంగళవారం అమ్మవారిని ఊరేగించారు. దీంతో ముత్యాలపల్లి నుండి కొత్తాట వరకూ సుమారు ఐదు కిలోమీటర్ల వరకూ జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మధ్యాహ్నం వరకూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి సమస్యను పరిష్కరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

వామ్మో.. ఆ రోడ్డులో ప్రయాణమా..!

అధ్వానంగా పెదకాపవరం-గణపవరం రోడ్డు, ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని శివారు గ్రామమైన పెదకాపవరం నుంచి గణపవరం వైపు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఆ రోడ్డు గుండా ప్రయాణించాలంటే స్థానికులు భయపడుతున్నారు. ఆకివీడు నుంచి గణపవరం వెళ్లేందుకు ఈ దారి దగ్గర మార్గం. ఉండి నుండి గణపవరం వెళ్లే రోడ్డు కంటే సుమారు ఎనిమిది కిలోమీటర్ల వరకూ దూరం తగ్గుతుంది. ఈ నేపథ్యంలో గణపవరం, తాడేపల్లిగూడెం వెళ్లేందుకు ఈ రోడ్డు మార్గానికే ఎక్కువ ప్రాధాన్యతిస్తారు. అయితే రోడ్డుపై రాళ్లు పైకి లేచి గోతులమయంగా తయారైంది. రాత్రి సమయాల్లో ప్రయాణం చేస్తే ప్రమాదాలు తప్పవని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ అధిక సంఖ్యలో ఆకివీడు నుండి తాడేపల్లిగూడెం వెళ్తుంటారు. గుమ్ములూరు, చినకాపవరం, పెదకాపవరంతో పాటు మరో ఐదు గ్రామాలకు గణపవరం, తాడేపల్లిగూడెం వెళ్లడానికి అవసరాలు ఎక్కువ ఉంటాయి. వాణిజ్యపరంగా తాడేపల్లిగూడెం హోల్‌సేల్ మార్కెట్ ఉండడంతో ఎక్కువ మంది తాడేపల్లిగూడెం నుంచి సరుకులు రవాణా చేస్తుంటారు. అవన్నీ ఈ మార్గం గుండానే తేవాలి. అయితే రోడ్డంతా గోతులతో ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు భయపడుతున్నారు. ఆకివీడు నుండి రాజమండ్రికి ఈ రోడ్డు గుండా రోజూ రెండు బస్సులు నాలుగు సార్లు తిరిగేవి. రోడ్డు బాగోకపోవడంతో సుమారు రెండు నెలల నుంచి ఇటు గుండా వచ్చే ఆర్‌టిసి బస్సులను నిలిపివేశారు. అయితే ప్రయాణికులు ఒత్తిడి చేయడంతో ఇటీవల మళ్లీ బస్సులు తిరుగుతున్నాయి. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలంటూ ఎన్నోసార్లు ఎంతోమంది అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. అయినా ఎవరూ పట్టించుకోని పరిస్థితి. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్న పెదకాపవరం నుండి గణపవరం వైపు వెళ్లే రోడ్డు

వరిసాగులో శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు

ప్రజాశక్తి - గణపవరం

రైతులు వరిసాగులో సైంటిస్టుల సలహాలు, సూచనలు పాటించి, అనుకూలమైన వరి వంగడాలను ఎంపిక చేసుకొని వారి ఆదాయాలు పెంచుకోవాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం మొయ్యేరు రైతు సేవా కేంద్రంలో జరిగిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ 2025పై రైతులకు అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచి దూళ్ల కుటుంబరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ధర్మరాజు మాట్లాడుతూ త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి ప్రతి రైతుకూ రూ.20 వేలు ఇస్తామన్నారు. రైతుసేవా కేంద్రాల్లో గ్రామ, వ్యవసాయ, సహాయకులు, రైతులందరికీ ఒక వాట్సప్ క్రియేట్ చేసి రైతులకు ఎటువంటి సమస్యలున్నా ఆ గ్రూపు ద్వారా సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే తన దృష్టికి తేవాలన్నారు. కెవికె ఉండి వినయ లక్ష్మీ మాట్లాడుతూ సార్వా సాగుకు ఎంటియు 1212 రకం అనుకూలమని తెలిపారు. ఈ రకం విత్తనం తెగుళ్లను తట్టుకుంటుందన్నారు. గణపవరం వ్యవసాయాదికారి ప్రసాద్, పశువర్ధక శాఖ ఎడిఎ నాయక్ మాట్లాడారు. డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ వై.సుబ్బయ్య, ప్రిన్సిపల్ సైంటిస్ట్ మాధవీలత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ధర్మారాజు

విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సత్యఉషారాణి

ఎస్‌కెఎస్‌డి విద్యార్థినులకు ప్రతిభా అవార్డులు

ప్రజాశక్తి - తణుకు

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర ప్రభుత్వం అందించే షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులకు తణుకుకు చెందిన ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల (జూనియర్) విద్యార్థినులు పి.అపర్ణ (హెచ్ఇసి), పి.శోభారాణి (హెచ్ఇసి), ఎండి ఆయేషా (సిఎస్ఇ), వి.చిన్ని(సిఎస్ఈ), పి నీలిమ(ఎంపిహెచ్‌డబ్ల్యు)కు సోమవారం భీమవరంలో అల్లూరి సీతారామరాజు భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రశంసా పత్రం, రూ.20 వేల నగదు, మెడల్స్ అందించారని కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి విద్యార్థులకు పుష్పగచ్ఛాలు అందజేశారు. ఈ అవార్డులు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ఎంఇఒ-2 పి.రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - ఆచంట

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకీకరించి, ఆధునిక సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్యనందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఇఒ-2 పి.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆచంట జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు అందించే పుస్తకాలు, బ్యాగ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొదటి విడతగా ఇప్పటివరకూ 3,533 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటిని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న తోడ్పాటును అందిపుచ్చుకుని బాగా చదువుకొని జీవితంలో పైకి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగ్‌లను పరిశీలిస్తున్న ఎంఇఒ-2 రాజేంద్రప్రసాద్

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సిలో మంగళవారం జరిగిన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ప్రతినెలా 9, 10 తేదీల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. సచివాలయం పరిధిలోని గర్భిణులు 71 మందిని పరీక్షించి మందులు అందజేసినట్లు చెప్పారు. డాక్టర్ ఓంకార్‌నాథ్ మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు మాట్లాడుతూ యూరిన్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ సిహెచ్ సత్యవతి, స్టాఫ్ నర్సు ఓగిరాల పరిమళ సుమన, హెచ్‌వి సిహెచ్ పద్మజ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్‌సి వద్ద డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, డాక్టర్ ఎం.నవ్యజీవన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులకు పరీక్షలు చేసి సలహాలు అందించారు. రోటరీ క్లబ్ పాలకొల్లు అధ్యక్షులు రావాడ సతీష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి గర్భిణులకు పోషకాహారం అందజేశారు. ఆర్థిక సహకారాన్ని లంకలకోడేరు వాసి వేగేశ్న సూర్యనారాయణ రాజు భార్య అరుణ అందించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, మద్దాల వాసు మాట్లాడారు. గర్భిణులు మనసు ప్రశాంతంగా ఉంచుకొని యోగా చేయాలన్నారు. డాక్టర్ నవ్యజీవన్ మాట్లాడుతూ గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. రోటరీ అధ్యక్షులు రావాడ సతీష్, కార్యదర్శి జవాజి కళ్యాణ్, కోశాధికారి పి.సత్యనారాయణ, మానవతా అధ్యక్షులు మద్దాల వాసు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

తాడేపల్లిగూడెం : రైతులు కృషి విజ్ఞాన కేంద్రం సేవలు ఉపయోగించుకోవాలని కెవికె విస్తరణ అధికారి వి.దీప్తి సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా వెంకటరమణ గూడెంలో ముందస్తు ఖరీఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విస్తరణ అధికారి దీప్తి మాట్లాడుతూ రైతులు కృషి విజ్ఞాన కేంద్రం సేవలను వినియోగించుకోవాలన్నారు. అలాగే కెవికె గ్రామీణ యువతకు నిర్వహించే స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గేదెల పరిశోధనా సంస్థ అధిపతి కె.ఆనందరావు పశు గ్రాస రకాలు గురించి వివరించారు. అనంతరం రైతులకు కూరగాయలు సాగు పుస్తకాలు, జీవన ఎరువులు అందజేశారు. పెదవేగి ఆయిలపామ్ పరిశోధన సంస్థ నుంచి ఆర్‌పి.ప్రేమలత, గ్రామ సహాయ అధికారి నాగరాజు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. డ్రోన్ ప్రదర్శన నిర్వహించారు.

కిక్కిస బోదెను పరిశీలించిన డ్రెయినేజీ అధికారులు

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండలం వాండ్రంలోని కిక్కిస బోదెను మురుగు పారుదల శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం స్థానిక ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు పంట, మురుగు బోదెల ప్రక్షాళనకు కృషి చేస్తున్నారని, వారి సూచనల మేరకు నియోజకవర్గంలోని మురుగు బోదెలు ప్రక్షాళన చేపడతామని తెలిపారు. త్వరలో వాండ్రం గ్రామంలోని కిక్కిస బోదె సర్వే చేయించి ఆక్రమణలను మార్కింగ్ చేయించి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో డ్రెయినేజీ శాఖ డిఇ ఉగ్ర నరసింహ అప్పన్న, జెఇ సోమిశెట్టి జయప్రకాష్, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం.ప్రవీణ్ కుమార్, విఆర్‌ఒ ఎస్.చిన్నారావు, కోపల్లె నీటిపారుదల సంఘం ఉపాధ్యక్షులు యలమల రాము, పలువురు రైతులు పాల్గొన్నారు.

బోదెను పరిశీలిస్తున్న డ్రెయినేజీ అధికారులు

మహిళలను అవమానిస్తే సహించబోం

కూటమి ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్రంలోని మహిళలను దూషించి వారిని అవమానిస్తే సహించబోమని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ హెచ్చరించారు. కూటమి ఆధ్వర్యంలో తణుకు నరేంద్ర సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత అయిదేళ్ల వైసిపి హయాంలో అధికార మదంతో జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలందరినీ ఎన్నో అవమానాలకు గురి చేశారన్నారు. రైతులను సైతం హింసించిన తీరు, అమరావతి మహిళా రైతులపై చేసిన దౌర్జన్యాలకు రాష్ట్ర ప్రజలంతా చూశారన్నారు. సాక్షి టీవీ కనుసన్నల్లో అమరావతిని అవమాన పరచే విధంగా మాట్లాడ్డం గర్హనీయమన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజును కేవలం అరెస్టు చేయడమే కాకుండా వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: రాజధాని మహిళలను కించపరుస్తూ మాట్లాడడం దారుణమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. రాయలంలో మంగళవారం సాక్షి న్యూస్ పేపర్లను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరావతి రాజధానిపై విష ప్రచారం తగదన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కాళ్ల : అమరావతి ప్రజలపై వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలపై తప్పనిసరిగా చర్యలు ఉంటాయని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణరాజు స్పష్టం చేశారు. పెదఅమిరంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ వ్యాఖ్యలపై డిప్యూటీ స్పీకర్ లేఖ రాశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. ఇలాంటి అవమానకర భాషను ఎవరూ వాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

తాడేపల్లిగూడెం : వైసిపి ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందని రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జి పేర్కొన్నారు. అమరావతి మహిళలపై సాక్షి టీవీలో జరిగిన డిబెట్‌లో అనుచిత వ్యాఖ్యలు నిరసిస్తూ కూటమి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, జనసేన వీర మహిళలు పాల్గొన్నారు.

నరసాపురం : జగన్మోహన్ రెడ్డి మహిళలకు వెంటనే క్షమాపణ చెప్పాలని రాష్ట్ర మహిళ కమిషన్ మాజీ సభ్యురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరావతిపై దుష్ప్రచార దాడి చేయించినందుకు జగన్ క్షమాపణ చెప్పాలన్నారు.

పాలకొల్లు : అమరావతి మహిళలపై, రాజధానిపై అసత్యాలు ప్రచారం చేసిన సాక్షి ఛానల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కూటమి మహిళా నేతలు గాంధీ బొమ్మ సెంటర్లో ఆందోళన చేపట్టారు. అలాగే 100 అడుగుల నల్ల బ్యానర్ చేపట్టి నిరసన తెలిపారు.

తణుకు : ధర్నాలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

మా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

డిప్యూటీ స్పీకర్‌కు ఆక్వా రైతుల వినతి

ప్రజాశక్తి - కాళ్ల

జిల్లాలో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జిల్లాలోని ఆక్వా రైతులు డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజును కోరారు. పెదఅమిరంలో మంగళవారం వారు డిప్యూటీ స్పీకర్‌ను కలిసి సమస్యలు వివరించారు. రెండు రోజుల క్రితం అమెరికా యాంటీ డంపింగ్ డ్యూటీ పెంచడంతో రొయ్యల కౌంట్ల ధరలు రూ.10 చొప్పున తగ్గించారని తెలిపారు. దీంతో ఆక్వా రైతులు నష్టపోతారని, ధర తగ్గకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న
నాలుగో అదనపు జిల్లా జడ్జి సత్యవతి

5న జాతీయ లోక్ అదాలత్

నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి

ప్రజాశక్తి - తణుకు

జులై 5వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు కేసులు రాజీ చేసుకుని తద్వారా విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి సూచించారు. మంగళవారం తణుకు కోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సత్యవతి మాట్లాడారు. రాష్ట్రంలో కోర్టులు పనిచేసే ప్రతిచోటా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీపడు క్రిమినల్ కేసులు, ఎక్సైజ్, చెక్‌బౌన్స్, ప్రోనోట్, అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేస్తారన్నారు. పోలీసు అధికారులు కక్షిదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి రాజీ చేయాలని తెలిపారు.

జర్నలిస్టు శ్రీనివాసరావును విడుదల చేయాలని వినతి

ప్రజాశక్తి - ఆకివీడు

పత్రికలు, టీవీలు ఎదుట వ్యక్తి చెప్పిన విషయాన్ని ప్రజల ముందుకు తీసుకురావడం వరకే జర్నలిస్టుల బాధ్యత అని, వారితో దెబ్బలాడడం కాదని ఆకివీడు పాత్రికేయులు తెలిపారు. సాక్షి టీవీలో వచ్చిన కథనంలో కొమ్మల శ్రీనివాసరావు ఇంటర్వ్యూ మాత్రమే చేశారని ఆయన మాట్లాడ లేదని వివరించారు. ఈ స్థితిలో ఆయన అరెస్టు ఎంత మాత్రం సమంజసం కాదని, ఆయనను వెంటనే విడుదల చేయాలని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావుకు మంగళవారం స్థానిక విలేకరులు వినతిపత్రం అందజేశారు.

రోడ్డు, కల్వర్టు పనులు పూర్తి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నాలుగు ప్రధాన రోడ్లను కలిపే మార్టేరు - పెనుగొండ రోడ్డు, నెగ్గిపూడి శివారు పెట్రోల్ బంక్ సమీపంలో కల్వర్ట్ నిర్మాణం పనులు పూర్తయినట్టు ఆర్‌అండ్‌బి ఎఇ టిఆర్‌వి.ప్రసాద్ మంగళవారం తెలిపారు. యథావిధిగా వాహనాలు తిరగొచ్చన్నారు. ప్రస్తుతం పెనుగొండ వద్ద పెద్దవంతెన మరమ్మతు పనులు పూర్తికానందున భారీ వాహనాలు, ఆర్‌టిసి బస్సులు, లారీల రాకపోకలు సాగించడానికి అనుమతి లేదని తెలిపారు.

నేటి నుంచి ఒక్కపూటే తాగునీరు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రధాన కాలువకు నీటి సరఫరా ఆలస్యం కావడంతో పట్టణ ప్రజలకు బుధవారం నుంచి ఒకపూట మాత్రమే తాగునీరు సరఫరా అవుతుందని మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ఉదయం పూట మాత్రమే తాగునీరు సరఫరా చేస్తారని, ప్రజలు గమనించాలని కోరారు. తాగునీటి కొరత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటిని వృథా చేయవద్దని సూచించారు. ప్రధాన కాలువకు నీరు వదిలిన తర్వాత రెండు పూటలా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

14 నుండి విద్యార్థులకు బస్ పాస్‌లు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్టూడెంట్ బస్ పాస్ కౌంటర్ (పాసులు ఐడి కలర్ మారడం వల్ల) ఈ నెల 12, 13 తేదీల్లో విద్యార్థులకు బస్సు పాసులు ఇవ్వబోమని ఆర్‌టిసి డిపో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ ఆర్.సుధారాణి తెలిపారు. ఈ నెల 14 నుంచి మళ్లీ బస్ పాస్‌లు ఇస్తారని చెప్పారు. కొత్త పాసులు తీసుకునే విద్యార్థులు బస్సుపాస్ అప్లికేషన్ ఆన్‌లైన్లో అప్లోడ్ చేసుకుంటే బస్సు పాస్ కౌంటర్‌లో క్యూలో నిలబడాల్సిన అవసరం ఉండదని, విద్యార్థులు గమనించాలని కోరారు.

కాలువల్లోకి ఆక్వా వ్యర్థాలు వదిలితే కఠిన చర్యలు

ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - ఉండి

పంట కాలువల్లోకి ఆక్వా వ్యర్థ జలాలను వదిలితే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా పోలీసు కేసు నమోదు చేస్తామని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. ఉండి మండలం కలిసిపూడిలో ఆక్వా వ్యర్థ జలాలను పంట కాలువలోకి వదలడాన్ని ఎంఎల్‌ఎ దృష్టికి స్థానిక విలేకరులు తీసుకెళ్లగా వెంటనే కారకులపై ఎంఎల్‌ఎ కేసు నమోదు చేయించారు. ఫోన్ కొట్టు.. ప్రైజ్ పట్టు కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం రూ.మూడు వేలు బహుమతి అందజేశారు. దీంతో ప్రతి ఆక్వా రైతు పంట కాలవలోకి నీరు వదలడానికి భయపడే పరిస్థితి వచ్చి సొంతంగా మురుగుబోదె తవ్వించుకుంటాడని ఆయన తెలిపారు.